# పాఠం 16 భారతదేశ జాతీయోద్యమం - దేశ విభజన, స్వాతంత్ర్యం:1939-1947

## కీలక భావనలు

- **భారత ప్రభుత్వ చట్టం 1935:** దీనిని బ్రిటిషు పార్లమెంట్ భారతదేశ పాలన కొరకు చేసింది. దీని ప్రకారం రాష్ట్రాలకు "రాజ్య (డొమినియన్) ప్రతిపత్తి" ఇవ్వబడింది.
- **డొమినియన్ ప్రతిపత్తి:** స్వయం పరిపాలన అధికారాలు కలిగివుండటాన్ని డొమినియన్ ప్రతిపత్తి అందురు.
- **వ్యక్తిగత సత్యాగ్రహాలు:** రెండువ ప్రపంచ యుద్ధ సమయంలో 1940, 1941 లలో బ్రిటిష్ ప్రభుత్వంపై ఒత్తిడి పెంచటానికి కాంగ్రెస్ వ్యక్తిగత సత్యాగ్రహాలను చేపట్టింది.
- **విభజించు పాలించు:** భారతదేశంలో బ్రిటిష్ వారు అనుసరించిన విధానం.
- **ముస్లిం లీగ్:** ఇది 1906 లో ఏర్పడింది.
- **ప్రత్యేక నియోజక వర్గాలు:** 1909 నుంచి ముస్లిం లకు ప్రత్యేక నియోజక వర్గాలను ఏర్పాటుచేసారు.
- **RSS:** రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘం
- **పాకిస్థాన్ తీర్మాణం:** ముస్లింలకు ప్రత్యేక దేశం కోరుతూ ముస్లిం లీగ్ ప్రత్యేక పాకిస్థాన్ 1940 మార్చి 23 న తీర్మాణాన్ని చేసింది.
- **మహ్మద్ ఇక్బాల్:** "సారే జహాసే అచ్ఛా హిందూస్తాన్ హమారా" రచయిత. భారతదేశంలో వాయువ్య ముస్లిం రాష్ట్ర ఆవశ్యకతను గురించి మాట్లాడారు.
- **చౌదరీ రెహ్మత్ అలి:** పాకిస్తాన్ అన్న పేరును మొదటిగా రూపొందించారు.
- **పాకిస్తాన్:** పంజాబ్, ఆఫ్ఘన్, కాశ్మీర్, సింధ్, బలుచిస్తాన్ ల ఇంగ్లీషు అక్షరాల నుండి ఏర్పడింది.
- **క్రిప్స్ దౌత్యం:** 1942 లో జరిగింది.
- **క్విట్ ఇండియా ఉద్యమం:** 1942 ఆగష్టులో గాంధీజీ ఈ ఉద్యమాన్ని ప్రారంభించారు. ఈ ఉద్యమ కాలంలోనే గాంధీజీ "చేయు లేదా చావు" అన్న నినాదాన్ని ఇచ్చారు.
- **INA:** భారత జాతీయ సైన్యం. దీనిని 1942 లో భారతీయ సైనికులతో సుభాష్ చంద్ర బోస్ తయారుచేసారు.
- **తెభాగ ఉద్యమం:** బెంగాల్ లో కౌలుదారులు, భూస్వాములకు వ్యతిరేకంగా చేపట్టిన ఉద్యమం.
- **రాయల్ నౌకా దళం తిరుగుబాటు:** ఫిబ్రవరి 18, 1946.

www.digitalsocialteacher.in

- **ప్రత్యక్ష కార్యాచరణ దినం:** ముస్లిం లీగ్ పాకిస్థాన్ సాధన కొరకు 1946 ఆగష్టు 16 ను ప్రత్యక్ష కార్యాచరణ దినంగా ప్రకటించింది.
- **మౌంట్ బాటెన్:** భారతదేశ చివరి వైస్రాయ్.
- **పాకిస్తాన్ కి స్వాతంత్ర్యం:** 1947 ఆగష్టు 14
- **భారత దేశానికి స్వాతంత్ర్యం:** 1947 ఆగష్టు 15
- **సంస్థానాల విలీనం:** ఈ ప్రక్రయను సర్దార్ పటేల్ విజయవంతంగా నిర్వహించారు.
- **రాజ భరణాలు:** స్వదేశీ సంస్థానాలను భారత ప్రభుత్వం స్వాధీనం చేసుకొని ఆయా రాజకుటుంబాలకు మంజూరు చేసిన పెన్షన్లను రాజ భరణాలు అందురు. వీటిని 1971 లో రద్దుచేసారు.

## 2 & 4 మార్కుల ప్రశ్నలు

**భారతదేశంలో వివిధ బృందాలు, వ్యక్తులు రెండో ప్రపంచ యుద్ధంపై స్పందించిన విధానాన్ని తెలపండి. వారు ఎటువంటి సందిగ్ధతకులోనయ్యారు?**

రెండో ప్రపంచ యుద్ధం పై భారతదేశంలో వివిధ బృందాలు, వ్యక్తులు రకరకాలుగా స్పందించారు.

i. కాంగ్రెస్: అనేక మంది కాంగ్రెస్ నాయకులు హిట్లర్, ముస్సోలినిలను వారు అనుసరిస్తున్న ఫాసిజాన్ని వ్యతిరేకించారు. అయితే భారతీయుల అభిప్రాయం తెలుసుకోకుండా, రాష్ట్రాలలోని కాంగ్రెస్ ప్రభుత్వాల అనుమతి లేకుండా భారతదేశాన్ని యుద్ధంలో భాగస్వామిగా చేయడాన్ని విమర్శించారు. ఈ పరిస్థితుల్లో కాంగ్రెస్ వారు ఎవరికి మద్దతు ఇవ్వాలనే సందిగ్ధతకులోనయ్యారు.

ii. గాంధీజీ: గాంధీజీ అహింసావాది కావున యుద్ధానికి విముఖుడు. అయితే పరోక్షంగా ఇంగ్లాండ్ వైపే మొగ్గు చూపాడు.

iii. ముస్లింలీగ్ (ఎమ్.ఎ జిన్నా): జిన్నా నాయకత్వంలోని ముస్లిం లీగు దేశ ప్రయోజనాల కంటే తమ స్వార్థ ప్రయోజనాలనే చూసుకుంది. బ్రిటిష్‌వారు ముస్లిం లీగును గుర్తించి తమ అభిప్రాయాలకు విలువిస్తే తాము యుద్ధంలో ఇంగ్లాండ్‌కు సహకరిస్తామని అన్నారు.

iv. సుభాష్ చంద్రబోస్: సుభాష్ చంద్రబోస్ రెండో ప్రపంచ యుద్ధంలో ఆంగ్లేయులకు ఎలాంటి సహాయం చేయరాదని అన్నాడు. ఈ సమయాన్ని భారతీయులు చక్కగా ఉపయోగించుకొని ఉద్యమాన్ని ఉధృతం చేయాలని పిలుపునిచ్చాడు. ఈయనను జైల్లో బంధించగా తప్పించుకొని పోయి జర్మనీ, జపాన్‌లలోని భారతీయ యుద్ధ ఖైదీలను సమీకరించి 'ఆజాద్ హింద్ ఫౌజ్'ను నడిపించాడు.

**2. యూదులు, ఇతర సమూహాలపై జర్మనీ దారుణంగా వ్యవహరించిన నేపథ్యంలో జర్మనీ, జపాన్‌లకి మద్దతు ఇవ్వడం నైతికంగా సరైనదేనా?**

i. హిట్లర్ కాలంలో జర్మనీలో యూదులు, ఇతర సమూహాలపై దారుణంగా వ్యవహరించడం జరిగింది.యూదులను చీకటి గదుల్లో బంధించి, ఆహారము, నీళ్ళు లేకుండా కొన్ని రోజుల పాటు ఉంచి ఆ గదుల్లోకి విషవాయువులను పంపించేవారు.

ii.ఆసియా ఖండంలో జపాన్ కూడా అలాంటి ప్రయత్నాలే చేసింది.ఇటువంటి పరిస్థితుల్లో జర్మనీ, జపాన్‌లకి మద్ధతు ఇవ్వడం సరియైనది కాదు.

**3. భారతదేశ విభజనకు దారితీసిన వివిధ కారణాల జాబితా తయారు చేయండి.**

భారత దేశ విభజనకు దారితీసిన వివిధ కారణాలు:

i. ముస్లిం లీగ్ ఏర్పాటు.

ii. బ్రిటిష్ వారు అవలంబించిన 'విభజించు-పాలించు' అనే విధానంతో కాంగ్రెస్ వారిని అణచి వేయడానికి ముస్లింలీగును రెచ్చగొట్టి ప్రత్యేక హక్కులను ప్రోత్సాహించింది.

iii. 1940 మార్చి 23న ఉపఖండంలో ముస్లింలు అధిక సంఖ్యలో ఉన్న ప్రాంతాలలో కొంత స్వయం ప్రతి పత్తిని కోరుతూ ముస్లింలీగు ఒక తీర్మానాన్ని ఆమోదించింది.

iv. 1946 ఆగస్టు 16ను దేశ విభజన కోసం 'ప్రత్యక్ష కార్యాచరణ'కు ముస్లింలీగ్ పిలుపునిచ్చింది.

v. భారత జాతీయ కాంగ్రెస్ ముస్లిం లీగ్ ను ఒప్పించటంలో విఫలం చెందటం.

**1. దేశ విభజనకు ముందు వివిధ సమూహాల మధ్య అధికారాన్ని పంచుకోవడానికి ఏఏ విధానాలను అవలంబించారు?**

దేశ విభజనకు ముందు వివిధ సమూహాల మధ్య అధికారాన్ని పంచుకోవడానికి ఈ కింది విధానాలను అవలంబించారు.

i. 1945లో బ్రిటిష్ ప్రభుత్వం ఒక ప్రకటన జారీ చేసింది. దాని ప్రకారం వైస్రాయ్, సైనికదళాల కమాండర్-ఇన్ చీఫ్ మినహా కేంద్ర కార్యనిర్వాహక వర్గాన్ని పూర్తిగా భారతీయులతోనే ఏర్పరచడానికి బ్రిటన్ సిద్ధం అయింది.

ii. అయితే ఈ కార్యనిర్వాహక వర్గంలో ముస్లిం సభ్యులను ఎంపిక చేయడానికి ముస్లింలీగుకు సంపూర్ణ అధికారం ఉండాలని జిన్నా పట్టుబడ్డాడు.

iii. కాంగ్రెస్, పంజాబ్‌లోని యూనియనిస్టు పార్టీ ఇంకా ఇతరులు ముస్లింలీగు ప్రతిపాదన ను వ్యతిరేకించారు.

iv. 1946లో రాష్ట్ర శాసన సభ్యులకు ఎన్నికలు జరిగాయి.ఈ ఎన్నికల్లో ముస్లిం నియోజకవర్గాల్లో ముస్లిం లీగ్ బలమైన పార్టీగా అవతరించింది.

v. 1946లో సాధారణ నియోజక వర్గాల్లో కాంగ్రెస్ పార్టీ 91% ఓట్లలో అఖండ విజయం సాధించింది.

**2. బ్రిటిష్ వలసపాలకులు తమ విభజించి, పాలించు విధానాన్ని ఏ విధంగా అమలు చేశారు? నైజీరియాలో అవలంబించిన విధానానికీ, దీనికీ మధ్య పోలికలు, తేడాలు ఏమిటి?**

భారత దేశంలో బ్రిటిష్ వారి విభజించు - పాలించు విధానం:

i. హిందూ, ముస్లింల మధ్య వైరుధ్యాలు పెంచారు.

ii. కాంగ్రెస్ పార్టీలో బ్రహ్మణులే ఎక్కువగా ఉన్నారని, అది హిందూ అభిమాన పార్టీ అని ముస్లింలను రెచ్చగొడుతూ ముస్లింలీగు పార్టీ ఎదగడానికి దోహదపడ్డారు.

iii. ప్రత్యేక పాకిస్తాన్ దేశం కోసం ముస్లింలు డిమాండ్ చేసే విధంగా ప్రోత్సహించింది కూడా బ్రిటిషే.

నైజీరియాలో అనుసరించిన విధానం:

i. నైజీరియాలో కూడా బ్రిటిష్ వారు విభజించు పాలించు విధానాన్ని అనుసరించారు. ఉత్తర నైజీరియా, దక్షిణ నైజీరియా ప్రాంతాల మధ్య వైరుధ్యాలను పెంచారు.

ii. నైజీరియా ఉత్తర భాగంలో హౌసా-ఫులానీ జాతివారు ఉన్నారు. వీరు ముఖ్యంగా ముస్లింలు. ఆగ్నేయభాగంలో ఈబో తెగ, నైరుతి భాగంలో యొరుబా తెగ వారు ఉన్నారు. వీరందరూ క్రైస్తవ మతంలోకి మారారు. ఈ మూడు ప్రాంతాల మధ్య ఘర్షణలు ఉండేవి. బ్రిటిష్ వారు వీటిని ప్రోత్సాహించి విభేదాలను పెంచారు.

**3. దేశ విభజనకు ముందు రాజకీయాలలో మతాన్ని ఏఏ విధంగా ఉపయోగించుకున్నారు?**

i. దేశ విభజనకు ముందు భారతదేశ రాజకీయాలలో మతం కీలక పాత్ర వహించింది. దీని ఆధారంగానే దేశ విభజన జరిగింది.

ii. దేశ స్వాతంత్రోద్యమంలో భారతీయులు చురుకుగా పాల్గొంటున్న సమయంలో ముస్లింలు తమ స్వంత ప్రయోజనాల కోసం డిమాండ్ చేశారు.

iii. అధిక సంఖ్యాకులైన హిందూ సముదాయంపై అల్ప సంఖ్యాకులైన ముస్లిం సముదాయం పెంచుకున్న భేదభావాలే దేశ విభజనకు దారి తీసాయని చెప్పవచ్చు.

iv. బ్రిటిష్ వారు 'విభజించు-పాలించు' విధానాన్ని అనుసరించి హిందూ- ముస్లింలను విడదీయడానికి పరోక్షంగా పథకాలు వేశారు.

v. 'ముస్లింలీగ్' పార్టీ ఏర్పడిన తర్వాత రెండు వర్గాల మధ్య వైషమ్యాలు ఎక్కువయ్యాయి.

vi. హిందువులు కూడా హిందువులందరినీ ఐక్యం చేయడానికి 'హిందూమహాసభ', 'రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘం' మొ॥సంస్థల ద్వారా ప్రయత్నించారు.

vii. రెండో ప్రపంచ యుద్ధం తర్వాత భారతదేశానికి స్వాతంత్ర్యం నిశ్చయమని తెలుసుకొని ముస్లిం లీగ్ వారు ప్రత్యేక పాకిస్తాన్ కోసం డిమాండ్ చేస్తూ అనేక ప్రాంతాల్లో అల్లర్లకు దిగారు.

viii. చివరకు మతం ఆధారంగానే 1947 ఆగస్టులో దేశ విభజన జరిగింది.

**4. స్వాతంత్ర్య పోరాట చివరి సంవత్సరాలలో కార్మికులను, రైతాంగాన్ని ఏ విధంగా సమీకరించారు ?**

స్వాతంత్ర్య పోరాట చివరి సంవత్సరాలలో కార్మికుల, రైతాంగ సమీకరణ:

i. 1946 ఫిబ్రవరి 22 న బొంబాయిలోని మూడు లక్షల మిల్లు కార్మికులు తమ పనిముట్లు వదిలిపెట్టి రెండు రోజులపాటు సమ్మె చేశారు.

ii. దీనికి మద్దతుగా దేశంలోని పలు ప్రాంతాలలో మిల్లులు, కర్మాగారాలలో పని ఆపేసి సమ్మెలు చేశారు.

iii. భారతీయ కమ్యూనిస్టు పార్టీ, సోషలిస్టు పార్టీలు ఈ ఉద్యమంలో చురుకుగా పాల్గొని కార్మికులను సమీకరించాయి.

iv. బెంగాల్‌లో పెద్ద భూస్వాముల నుంచి భూమిని సాగుకు తీసుకున్న చిన్న, పేద రైతులు ఆందోళన చేశారు.దీనినే 'తెభాగ' ఉద్యమం అంటారు. దీనికి నేతృత్వం వహించింది 'రాష్ట్ర కిసాన్ సభ'.

**5. సాధారణ ప్రజల జీవితాలను దేశ విభజన ఏ విధంగా ప్రభావితం చేసింది? విభజన తర్వాత జరిగిన వలసలకు రాజకీయ ప్రతి స్పందన ఏమిటి?**

సాధారణ ప్రజల జీవితాలపై దేశ విభజన ప్రభావం:

i. దేశ విభజన జరిగిన వెంటనే పాకిస్తాన్ ముస్లిం మత రాజ్యంగా ప్రకటించుకుంది. దీని వల్ల అక్కడ హిందువులు అభద్రతా భావానికి గురయ్యారు.

ii. పాకిస్తాన్‌లోని హిందువులు వారి ఆస్తులు (ఇళ్లు, భూములు) అన్నీ వదిలేసి కట్టు బట్టలతో లక్షల సంఖ్యలో భారతదేశానికి వలసరావలసి వచ్చింది. వీరిని కాంది శీకులు అన్నారు.

iii. వీరికి ఢిల్లీ చుట్టు పక్కల ప్రాంతాలలో పునరావాసం కల్పించడం భారతదేశానికి చాలా కష్టమైంది.

iv. అనేక ప్రాంతాలలో ఘర్షణలు చెలరేగాయి. హత్యలు, దోపిడీలు, దహనాలు యథేచ్ఛగా కొనసాగాయి.

రాజకీయ ప్రతిస్పందనలు:

i. అల్లర్లకు గురైన ప్రాంతాలను గాంధీజీ సందర్శించి తను ఇంతగా కష్టపడింది ఇటువంటి స్వేచ్ఛ, స్వాతంత్ర్యాల కోసం కాదని బాధపడ్డాడు.

ii. గాంధీజీ చొరవతో 'అల్పసంఖ్యాక వర్గాల హక్కుల' పై కాంగ్రెస్ తీర్మానం చేసింది.

**6. కొత్తగా ఏర్పడిన భారతదేశంలోకి వివిధ సంస్థానాలను విలీనం చేసే ప్రక్రియ ఒక సవాలుగా పరిణమించింది. చర్చించండి.**

i. 1947లో చేసిన భారత స్వాతంత్ర్య చట్టం ప్రకారం ఈ స్వదేశీ సంస్థానాలు వారి ఇష్టప్రకారం పాకిస్తాన్‌లో గాని, భారతదేశంలో గాని చేరవ చ్చు. ఎటూ చేరడం ఇష్టం లేకపోతే స్వతంత్రంగా నైనా ఉండవచ్చు.

ii. దీని ప్రకారం చాలా సంస్థానాలు స్వతంత్రంగా ఉండాలనే నిర్ణయానికి వచ్చాయి.

iii. వాటిని అదే విధంగా వదిలి పెడితే భారతదేశ మనుగడకే ముప్పు వస్తుందని భావించి వాటిని భారతదేశంలో విలీనం చేసే బాధ్యతను భారత మొదటి ఉప ప్రధానమంత్రి సర్దార్ వల్లభాయి పటేల్‌కు అప్పగించారు.

iv. ఆయన సంస్థానాల రాచరిక కుటుంబాలతో చర్చలు జరిపి భారతదేశంలో విలీనం కావలసిన ఆవశ్యకత గురించి తెలిపాడు.వారు తమంత తాముగా విలీనం కాకపోతే సైనిక చర్యతో నైనా ఆ ప్రక్రియ పూర్తి చేయాల్సి వస్తుందని తెలిపాడు.

v. 1947 ఆగస్టు 15 నాటికి జునాగఢ్, కాశ్మీర్, హైదరాబాద్‌లు తప్ప మిగిలిన సంస్థానాలన్నీ భారతదేశంలో విలీనం అయ్యాయి.

vi. జునాగఢ్‌లో రాజు ముస్లిం, అధిక మంది ప్రజలు హిందువులు. పాకిస్తాన్‌లో కలపడానికి చేసిన ప్రయత్నాలను ప్రజలు ఎదిరించారు. సర్దార్ పటేల్ సైన్యాన్ని పంపి ప్రజాభిప్రాయ సేకరణ జరిపి జునాగఢ్‌ను భారత్‌లో కలిపాడు.

vii. కాశ్మీర్‌లో రాజు హిందువు. ప్రజలు అధికులు ముస్లింలు. దీనిని పాకిస్తాన్‌లో కలుపుకోవాలని పాకిస్తాన్ సైనిక దాడి చేసింది. కాని రాజుకు, ప్రజలకు కూడా ఇది ఇష్టంలేదు. దీంతో అప్పటి కాశ్మీర్ రాజు కాశ్మీర్‌ను భారత్‌లో విలీనం చేస్తూ సంతకాలు చేశాడు. భారత సైన్యాలు వెళ్ళి పాకిస్తాన్ సైన్యాన్ని తరిమి కొట్టాయి.

viii. హైదరాబాద్ సంస్థానాన్ని 1948 సెప్టెంబర్ 17న పోలీసు చర్య ద్వారా భారత్‌లో విలీనం చేయడం జరిగింది.

ఈ విధంగా స్వదేశీ సంస్థానాలన్నిటినీ భారత్‌లో విలీనం చేయించిన ఘనత సర్దార్ వల్లభాయి పటేల్‌కు దక్కుతుంది. అందుకే ఆయన ఉక్కుమనిషి.

Prepared by:

**Rambabu Sunkari**

SA(SS)

ZPHS, Garudabilli

Vizianagaram Dt

www.digitalsocialteacher.in